15102023-DIS-08_Layout 1 10/15/2023 3:34 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి...
editpage@ntnews.com

వర్ణ వివక్షపై సంధించిన అక్షరాయుధాలు

భారతదేశంలో స్త్రీవాదం మొదలవ్వడానికి ముందే, ఆఫ్రికన్, అమెరికన్ స్త్రీలు, అక్కడ వేళ్లూనుకొని ఉన్న వర్ణ, లింగ వివక్షలపై బలంగా గొంతెత్తారు. తమ కలాలతో బీటుగా ఎదుర్కొన్నారు. తమ పోరాటాన్ని కవిత్వం ద్వారా, కథల ద్వారా నవలల ద్వారా ప్రపంచానికి తెలియజేయడం మొదలుపెట్టారు. ఆపై ఆ తొలితరం స్త్రీల హక్కుల ఉద్యమం స్థానికంగానూ, ప్రపంచవ్యాప్తంగానూ అనేక మంది స్త్రీలకు తమపై జరుగుతున్న బహుముఖ దోపిడీని ఎరుకలోకి తెచ్చింది. ఆ విధంగా స్త్రీల హక్కుల కోసం వివిధ సమూహాల స్త్రీలు సాహిత్యాన్ని దన్నుగా చేసుకొని పోరాటం చేశారు.

ఫిల్లిస్ వీట్లీ పీటర్స్ (1753-1784) 19వ శతాబ్దానికి ముందే అచ్చులో కనబడిన, ప్రజాభిమానం చూరగొన్న మొట్టమొదటి నల్లజాతి కవయిత్రి. పశ్చిమ ఆఫ్రికాకు చెందిన ఫిల్లిస్ వీట్లీని ఏడేండ్ల వయస్సులో కిడ్నాప్ చేసి అమెరికాకు చెందిన ధనిక వీట్లీ కుటుంబానికి బానిసగా విక్రయించారు. అయితే, ఆమెలోని సాహిత్యాభిలాషను, అసాధారణ తెలివితేటలను గుర్తించిన ఆమె యజమానులు ఆమెను ఎంతో ప్రోత్సహించారు. ఇంటి పనులతో పాటు కవిత్వాన్నీ అలవోకగా రాస్తుంటే, తమ వంతు తోడ్పాటునందించారు. ఆమె కవితల్లో 'ఆఫ్రికా నుంచి అమెరికాకు తీసుకురాబడినపుడు' (On Being Brought from Africa to America) అనే కవిత బహుళ ప్రాచుర్యం పొందింది. ఈ కవితలో ఆమె తాను అమెరికా తేబడటం ఒక అదృష్టంగా చెప్పుకొనేది. ఈ దేశానికి రావడం వల్లే తనకు చదువు, జ్ఞానం అబ్బాయని, తనకు దైవభావన, ప్రశాంతతలు లభించాయని చెప్తూ ఆమె వివక్షకు బలవుతున్న తన జాతీయులకు ఇలా పిలుపునిస్తుంది.

ఫిల్లిస్ కవిత్వం మొట్టమొదటి ఆఫ్రికన్ అమెరికన్ కవిత్వం. ఈమె కవిత్వం ఆఫ్రికన్ అమెరికన్ లిటరేచర్ అనే జానర్‌కు తెరతీసిందని చెప్పాలి. 1773లో ప్రచురించబడిన వీట్లీ కవితలు ఆమెతోపాటు ఆమె జాతికీ పేరు సంపాదించిపెట్టాయి. జనరల్ జార్జి వాషింగ్టన్ ఆమె కవిత్వాన్ని తనకు ప్రేరణగా అభివర్ణించుకున్నారు. ఆమె తన కవిత్వ పఠనానికి ఇంగ్లండ్‌కు వెళ్లినపుడు అమెరికా కవి 'జూపిటర్ హేమన్' ఏకంగా ఆమె కోసం ఒక కవిత రాసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఒక తెల్లవాడు అందునా కవి ఒక నల్లజాతీయురాలను ఆ విధంగా గౌరవించడం అప్పట్లో పెద్ద విషయమే మరి.

ఐతే వీట్లీ జీవితం నల్లేరుపై నడకలా ఏం సాగలేదు. గొప్ప కవయిత్రిగా పేరొచ్చినా సరే వీట్లీ బానిస బతుకులో ఏ మాత్రం మార్పు రాలేదు. ఆమె బానిసగానే జీవితాన్ని కొనసాగించింది. వీట్లీ తన జాతివాడే అయిన జాన్ పీటర్స్‌ను పెళ్లాడింది. ఇద్దరు పిలలు పుట్టి పసికందులుగానే మరణించారు. వీట్లీ మూడోసారి గర్భవతిగా ఉన్నప్పుడు ఆమె భర్త ఆమెను వదిలేశాడు. జాతివివక్షపై పోరాడినా సరే.. లింగ వివక్షను తప్పించుకోలేకపోయింది. బిడ్డ కూడా పుట్టి దక్కకుండా పోయింది. గర్భం దాల్చినప్పుడు కలిగిన అనేక ఆరోగ్య సమస్యలతో వీట్లీ తన 31 ఏట ఒక బోర్డింగ్ హౌస్‌లో చివరి శ్వాస విడిచింది. అన్ని ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆమె తనను తాను ప్రోత్సహించుకుంటూ తన రెండో కవిత్వ సంపుటిని సిద్ధం చేసింది. కానీ, దీన్ని ప్రచురించటానికి మాత్రం ఎవ్వరూ ముందుకురాలేదు. ఆమె ఎన్నో కవితలను అనేకమంది ప్రముఖులకు అంకితం చేసింది. అమెరికన్ రివల్యూషన్ ఊపందుకోగానే కాలమిస్టు దృక్పథంతో కూడా కవిత్వం రాసింది. అమె కవిత్వంలో ఆమె జీవితం చాలా తక్కువ సార్లు కనిపిస్తుంది. బానిసత్వానికి వ్యతిరేకంగా రాసినవి చాలా తక్కువే ఐనా 'ఆఫ్రికా నుంచి అమెరికాకు తీసుకురాబడినపుడు' మాత్రం ప్రపంచం నలుచెరగులా గుర్తింపు తెచ్చింది.

> 'కారుణ్యం నన్ను నా దేశం నుంచి
> ఇక్కడికి తెచ్చింది.
> నా అజ్ఞానపు ఆత్మకు రక్షకుడైన
> దేవుడిని పరిచయం చేసింది.
> కావాలో, వద్దో కూడా తేల్చుకోలేని
> నాకు ప్రశాంతతను అందించింది.
> కొందరెందుకో గొర్రెలాంటి మా జాతిని
> తిరస్కారంతో చూస్తారు. వారిది
> దెయ్యం పూసిన నలుపూ
> అంటూ అవమానిస్తారు.
> ఐతే నా సాటి నల్లవాళ్ళూ, నీగ్రోలూ,
> ఇహ, పరలోకాల రైలుబండిని
> అందరితో పాటూ ఎక్కొచ్చు'.

అంటూ ధైర్యాన్ని నూరిపోస్తుంది ఫిల్లిస్ తన కవిత్వంతో. ఈ కవితను కవయిత్రి రెండు భాగాలుగా విభజించింది. మొదటిభాగం ఆమె సొంత అనుభవం కాగా రెండో భాగంలో ఆమె తన గొంతుతో అనేక మందిని కలుపుకొన్నది. ఇంపరేటివ్‌లను వాడుతూ ఒక బలాన్ని, ఫోర్స్‌నూ పలికిస్తూ తనవారికి నైతిక స్థయిర్యాన్ని ఇవ్వగలిగింది. థర్డ్ పర్సన్‌లోకి మారిన ఆమె గొంతును మనం రెండో కవిత రెండోభాగంలో చూడవచ్చు. బానిసత్వంలోనూ వజ్ర సంకల్పంతో మెరిసిన ఫిల్లిస్ వీట్లీ అనేకమంది కవులకు ఆదర్శవంతమైన జీవితం గడిపింది. కొద్ది జీవితంలోనే మరపురాని కవయిత్రిగా, వ్యక్తిగా కవిత్వ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. వీట్లీ తర్వాత చాలామంది ఆఫ్రికన్ అమెరికన్ మహిళలు రాయడం మొదలుపెట్టారు. వీరిలో ఎక్కువమంది బానిసలుగా ఉంటూనే, వర్ణ వివక్షపై తమ ప్రశ్నలను కవిత్వరూపంలో సంధించారు. అలా రాసినవారిలో ఓల్డ్ ఎలిజబెత్ (1766-1866)

మరియా స్టీవార్ట్, హారియట్ జేకబ్స్, మేరీ యాన్క్యారీ, ఫ్రాన్సెస్ ఎలెన్ హార్పర్, డైసీ బేట్స్ ఇలా ఎందరో తామున్న బానిస స్థితిలోనూ, ఫాస్టర్‌హోమ్స్ అనే ప్రభుత్వ హాస్టళ్ల లోనూ ఉండి తమ కవిత్వంతో, వ్యాసాలతో వర్ణ వివక్షపై తమ నిరసనను తిరుగుబాటునూ వ్యక్తపరుస్తూ వచ్చారు. తెల్లజాతి ఆధిపత్యాన్ని బ్లాక్ అమెరికన్ పత్రికల్లో ప్రశ్నిస్తూ రావడం నిజంగా గొప్ప తెగింపు కదా?

> ఇరువయ్యో శతాబ్దానికి చెందిన డైసీబేట్స్ రచనలు గొప్ప సామాజిక మార్పునకు దోహదం చేశాయి. 'లాంగ్ షాడో ఆఫ్ లిటిల్ రాక్' అనే ఆమె స్వీయకథ 1988లో అమెరికన్ బుక్ అవార్డు గెల్చుకున్నది. ఈ శతాబ్దం మరెంతోమంది బ్రిలియంట్ రైటర్స్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది.

వెండెలిన్ బ్రూక్స్, టోనీ మారిసన్, ఆండ్రీ లార్డ్, ఏంజెలా డేవిస్, ఆలిస్ వాకర్, బెల్‌హుక్స్ తదితరులు తమ రాజకీయ, సాంఘిక దృక్కోణాలతో అమెరికా సాహితీ ప్రపంచాన్ని కొత్త ఒరవడిలోకి తీసుకెళ్లారు. అసలు సాహిత్యం అనే ప్రక్రియ ఎంత రెబెలియస్‌గా ఉండవచ్చో తమ రచనల ద్వారా, సంప్రదాయ రచనా రీతులను తుత్తునియలు చేసి, నాటి తెల్లజాతీయుల స్త్రీవాదాన్నీ, అందులోని ద్వంద్వ విలువలనీ తూర్పారబట్టారు.

ఈ స్త్రీలందరూ అమెరికా సాహితీ ప్రపంచంలో నల్లజాతి స్త్రీల రచనల అవసరాన్ని, ప్రాముఖ్యాన్ని నొక్కి వక్కాణించారు. లింగవివక్షను ప్రశ్నిస్తున్నట్టే కనిపిస్తూ, అందులోంచి నల్లజాతి స్త్రీలను కుట్రపూరితంగా విస్మరించడాన్ని, అందులోని తెల్లజాతి జాత్యహంకార ధోరణులనూ తన ప్రసంగం 'ఆయింట్ ఐ ఏ ఉమెన్'లో బట్టబయలు చేసింది. బెల్ హుక్స్ అనే రచయిత్రి, సిద్ధాంతకర్త, విద్యావేత్త. నల్లజాతి పురుషులను కలుపుకొని పోయే శ్వేతజాతి స్త్రీవాదులు నల్లజాతి స్త్రీవాదుల వద్దకు వచ్చేసరికి, జాతి వివక్షను బాహాటంగా ప్రదర్శించడం చూసిన బెల్‌హుక్స్ ఆ స్త్రీవాదులని బహిరంగంగా విమర్శించింది. నైతికత గురించి గొప్ప ప్రసంగాలు చేసే వైట్ ఫెమినిస్టులు, నల్లజాతీయులను బానిసలుగా చేసిన తెల్లజాతి నీతి గురించి మాట్లాడాలని గొప్ప తెగువతో నిలదీసింది. నల్లజాతి పురుషు లు సైతం నల్లజాతి స్త్రీలను కలుపుకోకుండా చేస్తున్న వివక్షా ఉద్యమాల నిజాయితీని ఆమె రచనల్లో ఎత్తి చూపింది.

> విద్యావేత్త అయిన టోనీ మోరిసన్ (1931-2019) తన నవల 'బ్లూయెస్ట్ ఐ'లో వర్ణ వివక్ష వికృత రూపాన్ని ప్రెజెంట్ చేసింది. ఎక్కడికి వెళ్లినా అంధ వికారంగా పరిగణింపబడే, అవమానింపబడే నల్లజాతి అమ్మాయి పెకోలా, అందానికి మారుపేరుగా చూడబడే నీలికండ్ల గురించి కలలు కనడాన్ని అక్షరీకరించింది. నవలలో ప్రస్తావించబడిన జాత్యహంకారం, పిల్లలపై హింస, అనైతికత వంకతో అమెరికన్ ప్రభుత్వం ఎన్నోసార్లు ఈ నవలను నిషేధించడానికి ప్రయత్నాలు చేసి విఫలమైంది.

ఇలా.. ఎందరో నల్లజాతి మహిళలు, శ్వేతజాతీయుల స్త్రీవాదంలో తమకు చోటు ఎందుకులేదో తమ సాహిత్యం ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. తమ అక్షరాలతో బహువిధ వివక్షలను చాలెంజ్ చేసి, నల్లజాతి బానిసత్వాన్ని రూపుమాపడంలో ప్రముఖ పాత్ర పోషించారు. వీరి స్ఫూర్తి ప్రపంచవ్యాప్తమై, భారతదేశంలో సైతం 19వ దశాబ్దిలో స్త్రీవాదం రూపుదిద్దుకుంది. ఆపై ఆ స్త్రీవాదం ఆధిపత్య కుల స్త్రీల గుప్పెట్లో ఉండటాన్ని దళిత ఆదివాసీ, మైనారిటీ, మహిళా సమాజం గమనించి, తదుపరి దళిత స్త్రీవాదం, ముస్లిం స్త్రీల స్త్రీవాదంగా అస్తిత్వ ఉద్యమాలు, సాహిత్యమూ ముందుకువచ్చాయి.

భారత్‌లో గల ఎన్నో కుల మత, సాంస్కృతిక వైరుధ్యాలు అణిచివేయబడ్డ స్త్రీల సాహిత్యాన్ని కాస్త ఆలస్యం చేసినా, మొత్తానికి నల్లజా తి స్త్రీవాదుల, ఉమెనిస్టుల స్ఫూర్తి భారతీయ పీడిత వర్గాల, కులాల స్త్రీల స్త్రీ వాదం ఉద్భవించేందుకు ఎంతగా నో తోడ్పడిందని ఒప్పుకొని తీరాలి.

> 'దెయ్యం పూసిన నలుపుగా మనల్ని ఏహ్యతతో చూస్తున్న వారందరితో పాటు మనం కూడా ఇహలోకంలో, పరలోకంలో సైతం అన్నివిధాలా సమానులమే. సమానత్వానికి నల్లవాడూ, క్రైస్తవులూ.. అందరూ అర్హులే అంటూ, సున్నితంగా చురకలంటిస్తుంది. సునిశిత ధిక్కారం పదాల్లో పలికిస్తుంది ఫిల్లిస్. ఆమె తొలి కవితల్లో మనం భక్తిభావాన్నీ, నైతికతను ప్రోత్సహించే కవితలనే ఎక్కువగా చూస్తాం.

అరుణ గోగులమండ
88971 07984

పూల పండుగ

గుమ్మడి రుద్రాక్ష గునుగు మందారము
బంతిచామంతి కుంబడియు వీర
తంగేడు నవవిధ తరువులపూలతోన్
ఊరేగె బతుకమ్మ తేరువోలె
వేపకాయల అట్ల వెన్నముద్దటుకుల
ముద్దపప్పెంగిలి సద్దుల రుచి
అలిగిన నానబియ్యంబునన్ బతుకమ్మ
నాయనమ్ముల తోడ వాసిగాంచె

అంబికను తలంచి యనురాగ దివ్వెలై
అతివలెల్ల మెరిసెనాడిపాడి
పూలకోక గట్టి పుడమి పరవశింప
బంగరు తెలంగాణ సింగడయ్యె.

కుల మతమ్ములనెంచక గొడవ పడక
బ్రతికినన్నినాళ్ళు పరుల హితము తలచి
తరుగులేనట్టి ప్రేమను సిరిగపంచు
బంగరు బతుకమ్మా నీకు వందనములు

తెలుగు వారి ఘనత నలుదిశల మెరయ
పసిడి వన్నెల బ్రతుకును వరమునొంది
ఇల తెలంగాణ మందున ఇంపుగొలిపె
అలరుబోడిల బతుకమ్మ ఆట పాట

తరుణుల వేల్పుగ వెలసిన
కరుణామృత వర్షిణి శుభకర గౌరమ్మా
చరితాత్మనొందెడి హృదిని
వరముగ కురిపింపవమ్మ పర్వదినమునన్

రాకుమార
95501 84758

లోకో భిన్న రుచిః అంటారు. మనుషులు ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. అలాగే మానవాళి ప్రస్థానంలో సాహిత్యం విభిన్న ఆస్వాదనలను మనకు అందిస్తుంది. ఆరోగ్య సమాజ నిర్మాణంలో కవిత్వం పాత్ర అమోఘం అన్నది ఇప్పటికే తేటతెల్లమైంది. ప్రపంచాన్ని తనదైన కవిత్వ రెటీనాతో చూడటమే కవుల లక్షణం. అందుకే కవులను ప్రచ్ఛన్న శాసనకర్తలుగా అభివర్ణిస్తూ ఉంటాం. అయితే ఒక్కొక్కరి అనుభవాలు ఒక్కోలా ఉంటాయి. అనుభవాన్ని, అనుభూతులను నిక్షిప్తం చేయటానికి ఏ ప్రక్రియైన సరే అనిపిస్తుంది. అలాంటి స్పందించిన ఓ కవి హృదయం సృజనాత్మకతను జోడించి మనకు అందించిన ప్రక్రియ సప్త పది.

తెలుగు కవిత్వంలో సప్తపది

కవిగా, సాహితీవేత్తగా ప్రసిద్ధులైన సుధామ (అసలు పేరు అల్లంరాజు వెంకటరావు) మానస పుత్రిక సప్తపది. కవిగా, కార్టూనిస్టుగా, రచయితగా, విమర్శకునిగా, సమీక్షకునిగా, కాలమిస్ట్‌గా, పజిల్స్ నిర్మాతగా, వక్తగా తెలుగు సాహిత్య ప్రపంచానికి సుధామ చిరపరిచితులు. 'అగ్నిసుధ', 'చిత్రగ్రంథి', 'కవి కాలం', 'తెమ్మెర' సుధామ వెలయించిన కవితా సంకలనాలు. 'మనసు పావనగంగ' పేర లలిత గీతాలు, పాటల సంకలనం, 2001లో ప్రచురించిన 'సం.సా.రా.లు' గ్రంథానికి 2004లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ సాహితీ గ్రంథ పురస్కారం లభించింది.

సవ్యం/ భవ్యం/ కవితాత్మగా వెలసి దీపించు సప్తపది దివ్యం/ అంటూ చురుగ్గా జనాల్లోకి వచ్చిన కవితా ప్రక్రియ సప్తపది. మూడు ప్రాసలు ఏడు పదాలు అనేది సప్తపది భౌతికరూపం.

> **సప్త పది నిర్మాణ పద్ధతి:**
> సప్త పది అంటే మొత్తం ఏడు పదాలతో రూపొందే లఘు కవిత. వస్తువు ఏదైనా కావచ్చు. అనుభూతి, సామాజిక అంశం ఏదైనా సప్త పదిగా సంతరించవచ్చు. కవిత మొత్తం మూడు లైన్లు. మొదటి, రెండవ లైన్లలో ఒక్కొక్క పదమే ఉంటుంది. ఆ రెండు పదాలు కూడా అంత్యప్రాసతో ఉండాలి.

మూడవ లైన్‌లో ఆ రెండు పదాలను సమన్వయపరిచే అనుభూతియో, సామాజిక వ్యాఖ్యనో కవితాత్మకంగా ఐదు పదాల్లో ఉంటూ లఘు కవిత రూపొందాలి. అంతే కాదు! మూడవ లైన్‌లో ఐదవదైన చివరిపదం మొదటి రెండవ లైన్లలోని పదాల అంత్యప్రాసతోనే తప్పనిసరిగా ముగియాలి. సప్తపదిలో ఒక సారి వచ్చిన పదం మళ్లీ రాకూడదు. ఏదైనా పదం సమాస పదం అయినప్పుడు దాన్ని రెండుగా విడగొట్టి పదాల సంఖ్యను ఏడుగా సప్తపది లఘు కవితలో సరిపెట్టకూడదు

> **సప్తపదికి ఒక ఉదాహరణ:**
> నవత, కవిత చేపట్టి యువత సాగితేనే
> సాహిత్యానికి భవిత.
> కేవలం ఏడు పదాల నిబంధనలనూ
> పాటిస్తూ కవిత్వంగా
> రూపొందించడం ప్రధానం.

ఓసారి చూడండి అంతే.. ప్రసార భారతి సంచిక వాట్సాప్ విప్లవం అని చెప్పాలి. ఆ సంచిక ద్వారా ఎంతోమందిని ఆకట్టుకున్న సప్త పది కూడా అంతే విప్లవం తీసుకొచ్చింది. ఎంతగా స్పందించకపోతే విహారి లాంటి ఒక సాహితీస్రష్ట.. సప్తపదులు అంటే 'నూట పదహార్లు' రాయగలుగుతారు? సప్తపది శతాధికమైనది. సహస్రాధికం కావాలంటూ విహారి ఆకాంక్షిస్తూ రాసిన ముందుమాటలో ముక్త రచన జనపదం దాకా విస్తరించిందంటూ లోకజ్ఞత, తాత్వికత ఈ రచనకు కావాలంటూ పరితకు ఆలోచనా ప్రేరకం, అనుభూతి దాయకం, రసస్ఫోరకం కావాలని, సప్తపది ఆకాంక్ష అదేనని తెలియజేశారు. 2023, ఏప్రిల్ 17న సృష్టించబడిన ఈ ప్రక్రియకు నియమాలు పెట్టగానే దాదాపుగా 98 మందికి ఈ లఘు కవితా ప్రక్రియ కొత్త స్ఫూర్తి కలిగించింది. 24 గంటల్లో 600 కవితలను పంపడం ఆషామాషీ విషయం కాదు. విహారి తొలిగా 'సప్తపది/ వినూత్నమిది/ రూపం సారం కావాలి కవి అమ్ములపొది' – అని రాసి మార్గదర్శకత్వం చేశారు. అంతటితో వదలకుండా, వచ్చిన కవితలను పరిశీలింపజేసిన సుధామ, వై.రామకృష్ణారావు న్యాయ నిర్ణేతగా ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులను అందించారు.

సప్తపదిలో పాద విభజన 1+1+5 అంత్యప్రాసతో పాటు భావ సమన్వయం కుదరాలి. సప్తపదిలో ఒకసారి వచ్చిన పదం మరోసారి రాకూడదు. సుధామ మొదట రాసిన లఘు కవితలు ఒక్కసారి పరిశీలిద్దాం.

'కాఫీ/ సాఫీ/ ఉదయం గొంతులో పడ్డాకే
నిరుత్సాహం మాఫీ' అంటూ
కాఫీ తాగనిదే రెండుకాళ్ల బండి
సాగని వైనాన్ని చెప్తారు. 'బడి /
గుడి/ బాల్యం నుండి వృద్ధా
ప్యానికి సాగు నడవడి'–
అంటూ బడి నుండి మొదలైన
యానం గుడిదాకా సాగిన
వృద్ధాప్య ఛాయలను 7 పదాల్లో
చెప్పేశారు. 'వలపు/ వగపు/
ఆమె పురస్కార తిరస్కారాల
బ్రతుకు మలుపు'– అంటూ స్త్రీ ప్రేమలోని పార్శ్వాలను ఎరుకజేశారు. 'పాపాయి/ సిపాయి/ ఇంటికి దేశానికి వారి ఉనికి వల్లే హాయి'– అంటూ తరతరాల జీవన గమనాన్ని ఎరుకపరిచాడు.

> ఇప్పుడు సప్తపదులు రెండో పుస్తకం కూడా మార్కెట్లోకి వచ్చేసింది. రమణ యశస్వి 'యశస్వీయ సప్తపదులు' పేరుతో రుజాగ్రస్త వ్యవస్థకు చికిత్స చేసే కవిత్వపు గుళికలను డాక్టర్ రమణ ఈ పుస్తకం నిండా పరిచినట్టు అనిపిస్తుంది. సామాజిక అభ్యుదయ ఆకాంక్షను వెలువరించే లఘు చిత్రాలుగా సప్తపదులు కనిపిస్తున్నాయి.

దృశ్యీకరణ స్ఫూర్తితో బాగా రాయగలవారు ఎందరో ఈ సాహితీ ప్రక్రియ ద్వారా వెలుగులోకి వస్తున్నారు. వై.రామకృష్ణారావు అన్నట్టు సప్తపది అనగానే మూడు ముళ్లు, ఏడడుగులు గుర్తుకొస్తాయి. మనం సాహితీ సప్తపదిలో మూడు ప్రాసలు, ఏడు పదాలు మననంలోకి వస్తాయి. యశస్వి గజల్స్, హైకూలు, నానీలు, రెక్కల్లాంటి సాహితీ ప్రక్రియను సృజించిన డాక్టర్ రమణ, సప్తపదుల ప్రక్రియలో కూడా కాళ్లు మోపటం, కలం చేత పట్టి సప్తపదులు చెక్కటం మెచ్చుకోదగిన అంశం. నిజంగానే విహారి మంచి సంకల్పంతో చెప్పిన వెంటనే రెండో పుస్తకం ద్విశతకంతో ఇంత తొందరగా మనకు అందటం గొప్ప విషయంగా చెప్పవచ్చు.

తెలికిచెర్ల విజయలక్ష్మి 'హంగు/ రంగు/ బట్టలెన్ని ఉన్నా మొదటి తువ్వాలు అమ్మ కొంగు'– అని రాసి అమ్మ కొంగులోని ప్రాశస్త్యం ఎంత గొప్పదో తెలియజేశారు. 'స్నేహం/ మోహం/ తేడా తెలిసిన యువతికి కలగదు ద్రోహం'– అని డాక్టర్ భండారం వాణి నేటి యువతకు హితవు పలికారు. 'మాట/ పాట/ ఒకటికొకటి తోడైతే రక్తి కడుతుంది ఆట'– అని కళ్ళే వెంకటేశ్వరశాస్త్రి రాశారు. 'పంచకట్టు/ చీరకట్టు/ ఆధునిక యువత వేషధారణలో నానాటికి తీసికట్టు'– అంటూ ఇప్పుడు యువత ఏ విధంగా ఆలోచిస్తుందో చక్కగా తెలియజేశారు యార్లగడ్డ శ్రీరంగలక్ష్మి. నిజమే మరి, క్రియ–ప్రక్రియ రెండూ కొత్తవి సృజించినవారికి షుక్రియా అని మనం అనుకుంటూ సప్తపదులు చెక్కుదాం. కొత్త ప్రక్రియకు ఆహ్వానం పలుకుదాం. సప్తపదుల సృజనకర్త సుధామకు అభినందనలు.

అయినంపూడి శ్రీలక్ష్మి
99899 28562

గునుగు పూల వ్యామోహం

> అమ్మ ఇచ్చిన టాస్క్ అది
> వాడలో ఈసారి మన బతుకమ్మ ఎవరెస్ట్‌లా
> నలుగురు ఎత్తి తలపై పెట్టితే
> నడుము వంగి వంతుల వారీగా మోయాలి
> చెరువు చేరేవరకు చమటలు పట్టాలి

సైకిల్ సవారి రోజూ చేను వైపు
గోనె సంచులు కుక్కి కుక్కి
అన్న తొక్కిన కదలని చక్రం
నెట్టుకుంటూ గుమ్మం చేరి గుమ్మరించీ
చెల్లె ఎక్కిరించేది చాట కూడా కాలేదని
అమ్మ కాడలు కత్తిరించి కలర్ అద్దినంక
తాంబూలంలో ఇంద్రధనుస్సు వెలసింది

> అసలు పోటీ తంగేడు దగ్గరే
> కొందరు కొమ్మలు కొమ్మలు విరిచి
> తొందరలో పూలు నేలపైనా రాల్చి
> వాడిపోతే అమ్మమ్మ చివాట్లు
> నిజంగా తంగేడు బంగారమే మరి

మా ఇంటి తీగనే కాని
తెల్లవారే సరికి బీరపూలు మాయం
పచ్చని ఆకులపైన కండ్లు ఎందరివో
పండుగ పూట తిట్ల పురాణం వద్దని
మిగిలినవి ఎగిరి ఎగిరి తెంపినం
గౌరవంతో గౌరమ్మ చెంతన చేరాయి

> రహస్య దాడి అల్లిపూలపైన
> అలారం పెట్టుకొని చీకట్లోనే వేట
> అన్న హీరోలా చెరువంతా గాలించి
> నాకూ ఈతరాదని గట్టు మీదనే కూచోబెట్టి
> చేతుల నిండా పట్టుకొని
> తెల్లవారేసరికి అమ్మ ఒడిలో

సద్దుల బతుకమ్మల ప్రదర్శన జెండా దగ్గర
ఒక్కో బతుకమ్మ వరుసలో చేరుతుంటే టెన్షన్
నాన్న రిక్షాలో తీసుకువచ్చాడు పెద్ద బతుకమ్మను
అమ్మ గర్వంగా సెంటర్‌లో పెట్టి మావైపు చూసింది
అన్నా నేను అమ్మను గెలిపించాం వాడకట్టులో
నోటినిండా సత్తు పిండి తీయదనం సంతోషంగా..

దాసరి మోహన్
99853 09080

ఐకమత్యపు పండుగ

> బతుకమ్మ పండుగ వస్తుందంటేనే ఊరూరా ఒక కొత్త ఉత్సాహం మొదలవుతుంది. ఇంటింటా ఉత్సవ సంరంభం వెల్లివిరుస్తుంది. చిన్నా– పెద్దా, బీద–ధనిక, ఆడ, మగా తేడా లేకుండా అందరూ జరుపుకొనే పండుగ ఇది. బతుకమ్మ ఆడవాళ్లు మాత్రమే జరుపుకొనే పండుగ అని చాలా మంది అనుకుంటారు. కానీ, అది నిజం కాదు. ఈ పండుగ కోసం అందరూ ఏడాది నుంచి ఎదురుచూస్తుంటారు. ఇది ఐకమత్యపు పండుగ.

బతుకమ్మ సామాన్యుల పండుగ. సబ్బండ వర్గాలు సంతోషంగా జరుపుకొనే పండుగ. రెండు వారాల పాటు పిల్లలందరికీ ఆటవిడుపు. సకలవర్గాల వారికీ సంతోషాన్ని కలిగించే ముద్దు ముడుపు. తెలంగాణలో ఈ పండుగకు పెండ్లయిన ఆడపిల్లలు తప్పకుండా తల్లిగారిండ్లకు వస్తారు. ఒకరకంగా ఇది బాంధవ్యాలను నిలిపి ఉంచే పండుగ.

ఈ విషయం వివరించే ఒక పాట కూడా ఉంది. ఇలా సాగుతుంది పాట. 'కలవారి కోడలు కలికి కామాక్షి – కడుగుచున్నది పప్పు కడవల్లో పోసి– అప్పుడే వచ్చెను ఆమె పెద్దన్న– కాళ్లకు నీళ్లిచ్చి కన్నీళ్లు నింపె– ఎందుకీ కన్నీళ్లు ఏమి కష్టాలు– తుడుచుకో కన్నీరు ముడుచుకో కురులు– ఎత్తుకో పాపడ్ని ఎక్కు అందలము– చేరి మీ వారితో చెప్పి రావమ్మా– వంట చేసే తల్లి ఓ అక్కగారూ– మా అన్నలొచ్చారు మమ్మంపుతారా– నేనెరుగ నేనెరుగ మీ బావనడుగు రచ్చలో కూచున్న రాజేంద్ర భోగి– మా అన్నలొచ్చారు మమ్మంపుతారా– తుడుచుకో కన్నీరు ముడుచుకో కురులు సుఖముగా పుట్టిల్లు పోయి రావమ్మా!' అంటూ ముగుస్తుంది. పెండ్లయిన ఆడపిల్ల అత్తవారింటిలో ఇంతమంది అధికారాల మధ్య మెలగాలని ఈ పాట తెలియజేసినా.. అంతిమంగా భర్త సహకారం, ప్రేమ ఉంటే మిగతావారు అడ్డు చెప్పరనే సత్యం కూడా ఉన్నది.

వ్యవసాయదారులే కాక ఇతరులు కూడా వర్షాకాలం ఆరంభంలో చేల గట్ల మీదో, నీళ్ల తొట్ల పక్కనో, ఇంటి పెరట్లోనో నారుపోసి తప్పక బంతి, గోరింట, ఉద్రాక్ష వంటి మొక్కలు పెంచుకుంటారు. ఈ పూలు కేవలం బతుకమ్మ పండుగ రోజుల కోసమే, బతుకమ్మను అలంకరించడానికే. ఇతర పండుగలకు, వ్రతాలకు, నోములకు కావాల్సిన పూలకు బోలెడు ఖర్చు అవసరం కాగా.. బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి వాడే తంగేడు, గునుగు, కట్ల, గన్నేరు, సీత జెడ, అల్లి, తామర వంటి పూలు కానీ ఖర్చులేకుండా దొరికేవి, గృహస్తుకు భారం కానివి. ఇక బతుకమ్మ పాటలు ఒక గొప్ప సాహిత్య సృష్టి. ఒక ప్రత్యేక ప్రక్రియ. ఎవరు రాశారో తెలియకపోయినా తరతరాలుగా జనుల నోళ్లల్లో నాని.. మౌఖికంగా బహుళ ప్రాచుర్యం పొంది నేటికీ నిలిచిపోయాయి. కాలం మారినా ఇప్పటికీ కొనసాగుతూ, నాటి స్త్రీ హృదయ సంవేదనను తెలుసుకోవడానికి ఒక పరిశోధన అంశంగా నిలబడ్డాయి.

పువ్వులను పూజించడం, నీళ్లను ఆరాధించడం అంటే ప్రకృతిని ప్రేమించడమే. జపాన్ దేశంలోని అందమైన పువ్వుల అమరిక 'ఇకబెనా' కంటే గొప్పదైనది బతుకమ్మ పూల అలంకరణ. అలాగే 'దాండియా' లాంటి ప్రత్యేక కోలాటంతో సరిసమానమైన ఆదరణను చప్పట్లతో ఆడే బతుకమ్మ ఆట పొందింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ చొరవ, ప్రోత్సాహంతో బతుకమ్మ ప్రాధాన్యం మరింత హెచ్చింది. ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో మాత్రమే ఆడే బతుకమ్మ ఇప్పుడు నగరాలకు పాకింది. వివిధ రాష్ట్రాల వారు కూడా ఇష్టంగా బతుకమ్మను నెత్తికెత్తుకుంటున్నారు.

(అక